### పెంజర్ల అనంతపద్మనాభస్వామి ఆలయానికి

# బస్సు సౌకర్యం కల్పిస్తాం

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



న్యాయయాత్రలో పాల్గొన్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కొత్తూరు, ఫిబ్రవరి 11 : పెంజర్ల అనంతపద్మనాభస్వామి ఆలయానికి త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్రలో భాగంగా కొత్తూరు, నందిగామ మండలాల్లో ఆదివారం జరిగిన సమావేశాల్లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహిళలకు ఫ్రీ బస్సు కల్పించడం వల్ల ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారితే వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. ప్రస్తుతం సమ్మక్క–సారక్క జాతర నడుస్తున్నందున గ్రామాల్లో బస్సులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. జాతర పూర్తి కాగానే రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నందిగామ ఎంపీపీ ప్రియాంక, మాజీ సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ కొత్తూరు మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నల్లగొండ బహిరంగసభను విజయవంతం చేయాలి



చలో నల్లగొండ బహిరంగసభ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి, ఫిబ్రవరి 11 : కృష్ణా నదిపై గల ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి తెలంగాణ ప్రభుత్వం అప్పగించడం ద్వారా కలిగే నష్టాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజా ఉద్యమ నిర్మాణానికి ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కోరారు. బహిరంగ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం పరిగిలో చలో నల్గొండ పోస్టర్లను మహేశ్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం ద్వారా తెలంగాణ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నల్లగొండ బహిరంగసభకు పరిగి నుంచి 20 బస్సులు, 100 కార్లలో పెద్దఎత్తున తరలివెళ్లడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, కౌన్సిలర్ నాగేశ్వర్, నాయకులు రవికుమార్, తాహెర్‌అలీ, నయీమ్, గౌస్‌పాషా, యూసుఫ్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఆత్మరక్షణే.. ఆయుధం



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్

- రంగారెడ్డి జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో కరాటే శిక్షణా తరగతులు ప్రారంభం
- సుశిక్షితులైన మాస్టర్లచే శిక్షణ
- నెల రోజులపాటు అభ్యసించనున్న విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న బాలికల ఆత్మరక్షణ కోసం సర్కారు బడుల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణ తరగతులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. బాలికలకు ఎలాంటి సంఘటనలు ఎదురైనా.. వాటిని ఎదుర్కొనేందుకు రక్షణగా విద్యాశాఖాధికారులు నిపుణులైన శిక్షకులచే జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కరాటే తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం సమయంలో రోజూ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో కరాటే శిక్షణ ఇప్పిస్తున్నారు. బాలికలపై తరచూ ఏదో ఒక ప్రాంతంలో జరుగుతున్న అఘాయిత్యాలను చూసి తల్లిదండ్రులు బాలికల రక్షణపై దిగులు పడుతున్న సమయంలో ప్రభుత్వం బాలికలకు రక్షగా కరాటే శిక్షణ ఇప్పిస్తున్నది. పాఠశాలల్లో చదువుకునే బాలికలకు శిక్షణ ఇప్పిస్తుండటంతో తల్లిదండ్రుల్లో ధైర్యం నిండుతున్నది. తమ పిల్లలు ఎలాంటి సంఘటనైనా ఎదుర్కొంటారనే నమ్మకం వారిలో కలిగింది. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో సర్కార్ విద్యపై గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెరుగుతున్నది.

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉన్న 239 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఇతర ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కేజీబీవీల్లో బాలికలకు ఇటీవల ఉచిత కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. తరగతులు నెల రోజుల పాటు కొనసాగనున్నాయని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు సుశిక్షితులైన కరాటే శిక్షకుల ద్వారా దరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు పాఠశాలలను అప్పగించి రోజూ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో బాలికలకు ఎదురయ్యే సంఘటనలను ఎలా ఎదుర్కోవాలో ప్రధానంగా నేర్పిస్తున్నారు. చాలా ప్రాంతాల విద్యార్థినులు పాఠశాలలకు కాలినడకన వెళుతున్నారు. ఇలాంటి సమయంలో ఎలాంటి సంఘటనలు జరిగినా వాటిని అధిగమించి తమ ప్రాణాలను రక్షించుకునేలా కరాటే దోహదపడుతుంది. జిల్లాలో ప్రారంభమైన ఈ శిక్షణా తరగతులను విద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

### కరాటే శిక్షణతో ఎంతో మేలు



సుశిక్షితులైన మాస్టర్లతో జిల్లావ్యాప్తంగా ఉన్న 264 ఉన్నత పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నాం. ప్రతి రోజూ శిక్షణలో పాల్గొంటున్న విద్యార్థినులు ఎంతో మనోధైర్యంతో ముందుకు సాగుతున్నారు. నాణ్యమైన విద్యతో పాటు కరాటే శిక్షణ అందిస్తున్నందున తల్లిదండ్రుల్లో ఎంతో ధైర్యం పెరుగుతున్నది. ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి పాఠశాలలో ఒక తరగతిని కరాటేకు కేటాయించాం.

**- సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి**

### మనోధైర్యం వస్తుంది



కరాటే నేర్చుకుంటున్న బాలికల్లో మనోధైర్యం వస్తుంది. తమ ఎదుట ఎలాంటి సంఘటనలు జరిగినా.. వాటిని ఎదుర్కొనేలా శిక్షణలో మెళకువలు నేర్పిస్తున్నాం. నెల రోజులపాటు ఇచ్చే శిక్షణతో బాలికల్లో నమ్మకం ఏర్పడుతుంది. ప్రతి పాఠశాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థినులు కరాటే శిక్షణలో పాలుపంచుకుంటున్నారు. శిక్షణా తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

**- శ్రీనివాస్, కరాటే మాస్టర్, ఇబ్రహీంపట్నం**



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న గురుకుల పాఠశాలల కో ఆర్డినేటర్ డాక్టర్ శారద

### సజావుగా

## గురుకుల ప్రవేశ పరీక్ష

**7193 మంది విద్యార్థులకు 6746 మంది హాజరు**

మొయినాబాద్, ఫిబ్రవరి 11: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశం పొందడానికి ఆదివారం పరీక్ష నిర్వహించగా పెద్దఎత్తున హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష ఉండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను 3 గంటల ముందే పరీక్షా కేంద్రాలకు తీసుకొచ్చారు. చిలుకూరు గురుకుల బాలుర పాఠశాలలో 480 మందికి 440., శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాలలో 240 మందికి 206., బంట్వారం గురుకుల బాలికల పాఠశాలలో 360 మందికి 338., చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో 240 మందికి 215., వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 480 మందికి 449 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 7193 మందికి 6746 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# వ్యవసాయాన్ని కుంగదీస్తున్న కాంగ్రెస్

- 100 రోజుల్లో 6 గ్యారెంటీల అమలు అసాధ్యం
- పార్టీ మారేది లేదు.. కేసీఆర్, బీఆర్ఎస్ వెంటే..
- చలో నల్లగొండకు భారీగా తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



చలో నల్గొండ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 11 : తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని కుంగదీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తిస్తున్నదని.. కృష్ణా, గోదావరి ప్రాజక్టులను కేంద్రానికి అప్పగించడంపై చలో నల్లగొండ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోదరుడు మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ తాను మాత్రం కేసీఆర్ వెంటే ఉంటూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేయడం సాధ్యం కాదని, 45 రోజులు గడుస్తున్నప్పటికీ కనీసం 3 గ్యారెంటీల అమలు కూడా జరగలేదన్నారు. 100 రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు కాకపోతే ఆందోళన చేపట్టడం ఖాయమని పేర్కొన్నారు.

కృష్ణా, గోదావరి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనానికి తార్కాణంగా నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి ప్రాజక్టులను కేంద్రానికి అప్పగించడంతో ప్రాజక్టులు కట్టుకోలేని, వ్యవసాయానికి కెనాల్ ద్వారా నీటిని కూడా వదులుకోలేని పరిస్థితి తలెత్తిందన్నారు. గతంలో కేంద్రం ఎన్ని ఒత్తిళ్లకు గురి చేసినప్పటికీ ప్రాజెక్టును కేసీఆర్ అప్పగించలేదని, కేంద్ర సహకారం లేకుండానే పెద్దఎత్తున ప్రాజెక్టులు నిర్మించి సత్తా చాటుకున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 13న చలో నల్లగొండలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. తెలంగాణ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ మహిపాల్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేశ్‌బాబు, బొంరాస్‌పేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, పర్సాపూర్ మాజీ సర్పంచ్ అంజద్, మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్ పాల్గొన్నారు

# మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం

- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- కొత్తగడి గురుకుల పాఠశాల సందర్శన




వైద్య సిబ్బందితో చర్చిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 11 : స్థానిక కొత్తగడి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 300 మంది విద్యార్థులు జాండీస్ సోకి అస్వస్థతకు గురైనట్టు తెలిసిన వెంటనే గత మూడు రోజులుగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం కొత్తగడి గురుకుల పాఠశాలను లింగ్యానాయక్ సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎవ్వరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వారికి అవసరమైన టెస్టులు, వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. జాండీస్ కారణంగా కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుపుతూ, చాలా మంది విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడిందన్నారు. అందులో 61 మంది చికిత్సల అనంతరం వారు తమ ఇండ్లకు వెళ్లినట్లు చెప్పారు. మరో 12 మందికి కడుపునొప్పి సమస్యలుండగా వైద్య శాఖ ఆధ్వర్యంలో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత పట్ల మున్సిపల్ వైద్యశాఖల ఆధ్వర్యంలో తక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

### పాఠశాలను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

కొత్తగడి గురుకుల పాఠశాలలో జాండీస్‌తో బాధపడుతున్న విద్యార్థులను ఆదివారం వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల సందర్శించి పరిశీలించారు. ప్రిన్సిపాల్ అపర్ణ, విద్యార్థులు, వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు త్వరగా కోలుకునేలా మెరుగైన చికిత్స చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మురళి, నాయకులు కిషన్‌నాయక్, అనంత్‌రెడ్డి, అంజయ్య ఉన్నారు.



## ఘనంగా రక్తమైసమ్మ జాతర

తాండూరు రూరల్ : తాండూరు మండలం ఓగిపూర్ గ్రామంలో ఆదివారం రక్తమైసమ్మ జాతర వైభవంగా జరిగింది. మాజీ సర్పంచ్ పద్మమ్మ, బసంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, తలారీ నర్సింహులు ఆధ్వర్యంలో అమ్మవారికి గ్రామంలోని మహిళలు పెద్దసంఖ్యలో బోనమెత్తి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పువాయిద్యాల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్

## ప్రజలకు ఉపయోగం లేని రాష్ట్ర బడ్జెట్

**బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్**

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ అన్నారు. షాద్‌నగర్‌లోని ఏబీ కాంప్లెక్స్‌లో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి స్పష్టత లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి అనే విధంగా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలకు సుమారు రూ.5లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాల్సి ఉండగా.. కేవలం రూ.53వేల కోట్లను మాత్రమే కేటాయించిందన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం గురించి పట్టించుకుంటారా లేదా బడ్జెట్ కేటాయిస్తారా అనే విషయం గురించి ఏమీ మాట్లాడడం లేదన్నారు. ప్రజల క్షేమానికి బీజేపీ కట్టుబడి పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబయ్య, వెంకటేష్‌గుప్తా, మహేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహ, శంకర్‌నాయక్, హరిభూషణ్, పద్మాకృష్ణయ్య పాల్గొన్నారు.





# బుక్ ఫెయిర్.. ఎంతో హుషార్

- ఆదివారం భారీగా తరలివచ్చిన సందర్శకులు
- అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన
- ఆలోచింపజేసిన బాలసాహిత్యం చర్చలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 ( నమస్తే తెలంగాణ) : చిరిగిన చొక్కా అయినా తొడుక్కో..కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాట. పుస్తకం ఎంత విలువైనదో ఈ వ్యాఖ్యం వెల్లడిస్తుంది. అందుకే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకుంటే విజయ తీరాల వైపునకు బాటలు వేసుకున్నట్టేనని నిపుణులు చెబుతున్నారు. పుస్తకం ఆనందాన్నిస్తుంది. అలవాట్లను మారుస్తుంది. మంచి స్నేహితుడిలా జీవితానికి మార్గనిర్దేశం చేస్తుంది. తరాల మధ్య వారధి వేస్తుంది. వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుతుంది. అందుకే పుస్తక పఠనం అందరి దినచర్యల్లో భాగం కావాలని హైదరాబాద్ బుక్ ఫెయిర్ చాటుతున్నది. పుస్తకాలు రేకెత్తించిన ఆలోచనలే కదా ప్రేరణగా నిలుస్తాయి. కానీ ఎంతో కష్టపడి వివిధ రంగాల్లో పైకి వచ్చిన వారంతా పుస్తకానికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చినవాళ్లేననే విషయం మరువకూడదు. ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు ఆదివారం భారీగా పుస్తక ప్రేమికులు తరలొచ్చారు. పుస్తక విలువను చాటడంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల నుంచి మొదలు కొని సీనియర్ సిటిజన్స్ వరకు ఫెయిర్‌కు వచ్చి..నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. సాహిత్యం, కథలు, క్రైమ్, పాలిటిక్స్, విదేశీ సంబంధాలు, వైల్డ్ లైఫ్, ఫొటోగ్రఫీ, ఎన్‌సైక్లోపీడియా, రొమాన్స్, ఫాంటసీ, రిలీజియన్ అండ్ సైన్స్, కుకింగ్, బయోగ్రఫిక్, చిల్డ్రన్, నాన్ ఫిక్షన్ తదితర వాటికి సంబంధించిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండటంతో నగరవాసులు కొనుగోలు చేశారు.

### బాల సాహిత్యంపై..

ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు ఫోన్లు, కంప్యూటర్లతో బిజీగా గడుపుతున్నారు. అకాడమిక్ పుస్తకాలు తప్ప.. ఇతర పుస్తకాల జోలికి పోవడం లేదు. పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గి వారంతా రోబోల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని అనేక అధ్యయనాలు సైతం హెచ్చరిస్తున్నాయి. కుటుంబ విలువలు సైతం వారికి అర్థం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల్లో పుస్తక పఠనాసక్తి కల్పిస్తే వారు ప్రయోజకులుగా తయారవుతారని నిపుణులు చెబుతున్నారు. అందులో భాగంగానే ఆదివారం రవ్వా శ్రీహరి వేదికపై బాలసాహిత్యంపై చర్చోపచర్చలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మణికొండ వేద కుమార్ మాట్లాడుతూ.. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందడానికి పుస్తక పఠనం ఉపయోగపడుతుందని వివరించారు. పిల్లలకు సంబంధించిన రచనలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. ఇప్పటికే చిన్నారులకు సంబంధించిన సాహిత్యం విరివిగా ఉన్నదని, తల్లిదండ్రులు వారిని పుస్తకాలపై ఆసక్తి పెంచుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్‌కు చెందిన యాపల్ గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఆంగ్లంలో రాసిన కథల పుస్తకం 'ద స్టోరీస్ ఆఫ్ యాపల్ గుడా చిల్డ్రన్' పుస్తకాన్నీ బాల సాహితీ వేత్తలు వీఆర్ శర్మ ఆవిష్కరించారు.



బొగ్గురవ్వలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

## రేపు జిల్లాకు కేంద్ర మంత్రి రాక

వికారాబాద్, ఫిబ్రవరి 11 : వికారాబాద్ జిల్లాకు మంగళవారం కేంద్ర టెలీ కమ్యూనికేషన్ శాఖ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్ రానున్నట్లు మోమిన్‌పేట ఎంపీడీవో శైలజారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మోమిన్‌పేట మండలం చీమల్‌దరి గ్రామానికి మధ్యాహ్నం 3 గంటలకు బీఎస్ఎన్ఎల్ సేవలను పరిశీలించేందుకు రానున్నారన్నారు. గత సంవత్సరం నుంచి చీమల్‌దరి గ్రామ పంచాయతీలో ఉచితంగా వైఫై సేవలు అందాయన్నారు. ఈ సేవల ద్వారానే ఆధార్ సెంటర్, ఐకేపీ, తదితర ఆన్‌లైన్ సేవలకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు.



ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు వికారాబాద్ ప్రాంతం నుంచే కాకుండా హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి అనంతగిరి పద్మనాభస్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలి వచ్చారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయం సందడిగా మారింది. అనంతరం అనంతగిరి అడవుల్లో పర్యటించారు. బంధువులు, స్నేహితులతో సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు. ప్రకృతి రమణీయతను చూస్తూ పరవశించిపోయారు.

